

కథ 1990

10

# కర్రావు

## కాట్రగడ్డ దయానంద్

గొర్రెల మంద దుమ్ము రేపుకుంటూ హడావుడిగా కదిలిపోయింది. పిల్లలందరూ ఆ దుమ్ములోనే గోళీలాడుకుంటూ పెద్ద పెద్దగా గోల చేస్తున్నారు.

"పిన్నాం! గుడ్డలెయ్యి," అంటూ సాకలి గోవిందు వరండాలో నుంచి కేకేసింది.

"కాస్సేపుండవే గోయిందు! పొయ్యి మీద తిరగ మోత మాడిపోతుంది," అంటూ లోపల్నుంచి సావిత్రమ్మ బదులు చెప్పింది.

బయట అలానే గోడ కానుకుని పరధ్యానంగా రోడ్డు మీదికి చూస్తోంది గోయిందు.

ఎవరో సాధువు, "మాతా! భిక్షాం దేహీ!" అంటూ ఇంటింటికీ తిరుగుతున్నాడు. కోడిగుడ్ల సాయిబు గుడ్లు కొని పనిలోపనిగా ముసలి అచ్చమ్మ మనమరాలికి దడుపు మంత్రం వేస్తూ తెగ ఆవులిస్తూ ఆయాస పడుతున్నాడు.

ఇవేవీ గోయిందమ్మ దృష్టికిపోలేదు. ఆమె నల్లగా ఎత్తుగా ఉంటుంది. పుట్టడమే ఒక కన్ను మెల్లతో పుట్టింది. పుట్టిం తర్వాత ఇంకో కంట్లో పువ్వు కూడా పూసింది. ఆమె వికారంగా ఉన్నా ఈడేరిన మరుసటి ఏడే సాకలి సూరయ్య పెళ్లాంగా ఈ ఊరు చేరింది. ఇప్పుడామెకు పాతికేండ్లు. గుడ్డల మూటల బరువు వీపు మొయ్యడాన నడుం కాస్తంత ముందుకు వంగిపోయినట్లుంటుంది.

"ఏమే! గోయిందూ నే విన్నది నిజమేనా?" అంటూ సావిత్రమ్మ మైలబట్టల్ని తీసుకొచ్చి గోయిందు ముందు పడేసింది. గోయిందు ఉలిక్కిపడి వేసిన బట్టల్ని జాగ్రత్తగా మడుచుకోసాగింది.

"కొన్ని కొన్ని విషయాలు వాటంతట అవే అందరికీ తెలుస్తాయే!" అంది సావిత్రమ్మ మళ్లీ.

"ఇదుగో ఈ పీట మీద కూర్చో"!

పీట మీద కూర్చుంటూ కళ్ల వెంబడి నీళ్లు తెచ్చుకుని అంది గోయిందు.

"అయితే ఈ సంగతి ఆసాముల ఇళ్లల్లో గూడా తెల్సిపోయిందన్నమాట" అని పైకి అని, 'సమ్మస్సరం నుంచీ గుండెల్లో దాచుకున్నా, దాచుకుని ఏం నాభం?' అని మనసులో అనుకుంది.

"నే విన్నది నిజమేనన్న మాట ?" అరాగా అడిగింది సావిత్రమ్మ.

"ఏం చెప్పమంటావు పిన్నాం? ఆయనకు ఉజ్జోగం పర్మినెంటు అయిందగ్గర్నుంచీ 'నువ్వు బాగా లేవు, నిన్నిడిచి పెట్టి వేరేదాన్ని తెచ్చుకుంటానంటు,' న్నాడు. ఆ ఊళ్లోనే మా కులముదేనంట. మొగుడు సచ్చిన గొడ్డుమోతుముండ మాయచేసిందో, మరుగుడు మందు సల్లిందోగాని నా మొగున్ని నాకు గాకుండా చేస్తుంది. ఎప్పుడన్నా ఆయన ఇంటికొచ్చినా పిల్లిమీదో, కుక్కమీదో పెట్టి కొడుతున్నాడు పిన్నీ!" చిన్నగా ఏడుస్తూ చెప్పింది గోయిందు.

"అయినా పదేళ్లు కాపురం చేసి ఇద్దరు పిల్లలు పుట్టిం తర్వాత వాడికిదేం తెగులే? నీ అలుసు చూసుకునేగాని మరుగుడు మందుల్లేవూ మంత్రాల్లేవే పిచ్చిదానా! అయినా మీ కులంలో మారుమనువులు చెల్లుతాయి గదా!"

"లేదు పిన్నాం! మొన్నామధ్య పస్తీక్కూడా వెళ్లొచ్చా! వాళ్లు అదే మందు పెట్టెరనే చెప్పేరు. మారు మనువు చేసుకుని వాడొస్తే ఆ ఎదవముండ తోటి కాపురం పంచుకుంటానా సావనైనా సస్తానుగానీ!"

"తొందరపడి పిరికి పనులు చెయ్యబాకు! నీ ఉసురు తగిలి నీ పిల్లల గతి ఏమవుద్దో ఆలోచించేవా?" అంటూ అన్నం, కూరలు తెచ్చి గిన్నెలో వేసి టిఫిన్‌లో మజ్జిగ పోసింది సావిత్రమ్మ.

"రేపైతే మా అయ్యొస్తాడు. మా కులం వాళ్లందరూ కూర్చుని ఏది నిర్ణయిస్తే అదే అమలవుద్ది," పైకి లేచింది గోయిందు.

వీపు మీద పెద్ద గుడ్డల మూట వేసుకుంది. దాని మీద చిన్న మూట, ఆ దానిపైన అన్నం గిన్నె, చేతిలో మజ్జిగ టిఫినూ...

సాకలిపాలెం వైపు కదిలింది గోయిందమ్మ.

"అమ్మా అమ్మా! తమ్ముడు మట్టి తింటున్నాడే!" అంటూ కూతురు ఎదురొచ్చింది. అన్నం గిన్నె కూతురు చేతికిచ్చి గుడ్డల మూటల్ని దబ్బున కింద పడేసింది. ఇంట్లో నుంచి ఇంకో గిన్నె తెచ్చి వరి అన్నం కూరలు అందులోకి తీసింది. మిగిలిన జొన్న సంకటి, వరిగ అన్నం బయట పందుల తొట్లో పడేసింది. కొడుకుని దగ్గరకు తీసుకుని కింద మట్టిలోనే కూలబడి జాకెట్టు ముడి విప్పి వాడికి పాలీయసాగింది.

గోయిందమ్మ ఆ ఇంటికి కాపురానికొచ్చి పదేళ్లయింది. వచ్చీరాగానే ఆడ దిక్కులేని సంసారాన్ని ఒక దారికి తేవాలని నిర్ణయించుకుంది. చెయ్యలేనని మానుకున్న ఇళ్లను ఆమె మళ్లీ ఉతకడం మొదలు పెట్టింది. సంవత్సరానికి అయిదారు పందులన్నా పెంచి అమ్మించేది. కూలడానికి సిద్ధంగా ఉన్న ఒంటి నిట్రాడు ఇంటిని రెండు నిట్రాడుల ఇంటిని చేయించింది. ఆ ఇల్లు కట్టడానికి ఇటుకలు మోసింది. తాటాకుల తోపులో ఆకులు పడగొట్టింది. కొన్నాళ్లు కరంటు పనిచేస్తే ఆ ఉద్యోగం ఖాయమై పర్మినెంటు అవుద్దని చెప్పి పెనిమిటి సూరయ్యను అటు పంపించింది. మగరాయుడిలా నిలబడి ఆ సంసారాన్ని ఒక స్థితికి తీసుకొచ్చింది.

మొగుడికి ఉద్యోమొచ్చి వేరే ఊళ్లో ఉంటానంటే, 'దూరభారం కదా! రోజూ తిరగడం కష్టంలే,' అనుకుని సరేనంది. ఆ తర్వాత సూరయ్య అక్కడెవర్నో ఉంచుకోవడం, ఇంటికి సరిగ్గా రాకపోవడం, వచ్చినా గోయిందుని కొట్టడం... నిన్నొదిలేస్తాననడం...

రేపు కులపెద్దలు అందరూ కూర్చుని మాట్లాడతారు. మాట్లాడి మాత్రం వాళ్లు చేసేదేముంది?

"నన్నైతే బలవంతాన వాడితో కాపురం చెయ్యమనరుగా," మనసులో అనుకుంటూ పైకే అనేసింది గోయిందు. అని ఎవరైనా విన్నారేమోనని చుట్టూ చూసింది.

తుమ్మచెట్టు మీద కూర్చుని వల్లంకి పిట్ట తోక కిందికీ పైకీ ఊపుతూంది.

"అమ్మో! పొద్దు చానా జరిగిపోయిందే. సాకిరేవుకి ఎప్పుడు పోవాల? ఎప్పుడు ఈ గుడ్డలన్నీ ఉతకాల," అంటూ కొడుకును కిందకు దించి పైకి లేచింది.

*

అప్పుడే ఊళ్లో నుండి బస్సు వెళ్లినట్టుంది. ఎర్రటి దుమ్ము వలయంలో ఊరంతా చిక్కుకుంది. ఆదివారం కావడాన ఊరికి ఎడంగా ఉన్న చర్చి మైకులో నుండి దేవుడి స్తోత్రాలు వినబడుతున్నాయి. ఊరికి మధ్యనున్న చిల్లచెట్ల నీడలో కొంతమంది నిశ్శబ్దంగా పేకాటాడుకుంటున్నారు.

ఆ చిల్లచెట్లను ఆనుకుని ఉన్న సాకలిపాలెంలో...

ఆ ఇంటి ముందు మూడు మంచాలు వాల్చి ఉన్నాయి. వాటి మీద కులం పెద్దలు కూర్చున్నారు. ఆడవాళ్లు కొంత మంది ఎడంగా కింద కూర్చున్నారు. వాళ్ల మధ్యలో గోయిందు కూర్చుని మట్టిలో పిచ్చి గీతలు గీస్తూంది. వాళ్లకు కాస్త దూరంలో ఉన్న తుమ్మ చెట్టుకు ఒక ఆవు, దానికి కాస్త ఎడంగా ఉన్న చెట్టుకు ఒక కోడెదూడ కట్టేసి ఉన్నాయి. ఆవుకు పొద్దుటి నుంచి నీళ్లు పెట్టకపోవడాన అది మనుషుల వైపు ఆశగా చూస్తూ అటు ఇటూ కదుల్తూంది.

"నేనైతే ఇద్దర్నీ సాదగలను. దీనికిష్టమైతే దాన్ని కూడా తీసుకొచ్చి ఇక్కడే ఉంచుతా! లేదంటారా? దీనికీ, నాకు ఇంతటితో చెల్లు. దాన్ని మనువాడేది ఖాయం," తేల్చి చెప్పేడు సూరయ్య.

అందరూ గోయిందుని చూచేరు. ఆమె ఏదో గొణిగింది. దాన్ని తర్జుమా చేసి ఇంకొకామె, "అది సావనైనా సస్తదంటగానీ ఇంకొక ఆడదానితో మొగుణ్ణి పంచుకోనని అంటూంది," అంది.

"అట్టయితే తెగతెంపులు చేసుకోవడమే మంచిది," మగాళ్లలోంచి ఎవరో అన్నారు.

"తెంపితే తెగడానికి ఇదేమన్నా అయిదార్రోజుల బంధమా?" ఆడవాళ్లలో నుంచి వినొచ్చింది.

"వాడు నా కిష్టం లేదంటుంటే అది మాత్రం ఎన్నాళ్లు కాపురం చేసుద్ది? రేపు వాడేదైనా కోపంతో అఘాయిత్యం చేస్తేనో?" ఎవరో ప్రశ్నించారు.

తర్జనభర్జనలు జరిగేయి.

కులపెద్దలందరూ అవతలకు వెళ్లి ఏదో మాట్లాడుకునొచ్చేరు.

వచ్చి ఈ పదేళ్ల వాళ్ల బంధాన్ని పుట్టుక్కుమని తెంపేసేరు, గోయిందమ్మకూ సూరయ్యకూ ఆరోజుతో ఏ సంబంధమూ లేదని తేల్చేరు. ఆమె కట్నంగా తెచ్చిన వెయ్యిన్నూట పదార్లూ, గిన్నెలూ, గ్లాసులూ ఏమన్నా ఉంటే అవీ వెనక్కిస్తామన్నారు. గోయిందు ఆడది కాబట్టి ఎదిగొచ్చిన ఆడపిల్లను ఆమెతోనే ఉంచాలన్నారు. మూడేళ్ల కొడుకు తండ్రితోనే ఉండాలనీ తేల్చేరు.

గోయిందమ్మ మనసు కుతకుత ఉడికింది.

"ఈ పదేళ్ల నుంచీ నేనీ ఇంటికి ఎంత చాకిరీ చేసేనో నాకు తెల్సు, నా రెక్కల కష్టం నేనిమ్మనటం లేదు. వాడికంటే నామీద ఇష్టం లేదు. వదిలేస్తానన్నాడు. సరే! మరి నా కొడుకుని నాక్కాకుండా చేయడం ఇదేం న్యాయం?" అంటూ ఎదురుతిరిగింది.

అందరూ ముఖముఖాలు చూసుకున్నారు.

"ఒసే పిచ్చిమొహమా! మగపిల్లోడ్ని నువ్వు పెంచగలవా? నీ కూతురు నీ చేతికందొచ్చింది. నువ్వు మళ్లీ లగ్గం చేసుకోకపోయినా నీ కూతురు అసరా అవుద్ది నీకు," అన్నాడు గోయిందు తండ్రి జోగయ్య.

తండ్రి ఆ మాట అనేసరికి ఆమె తల్లడిల్లిపోయింది.

కాసేపు మనసులో మధనపడింది. మరి కాసేపు పెద్దగా ఏడ్చింది. మూడేళ్ల కొడుకుని తనతోనే ఉండనియ్యమని అందర్నీ పేరుపేరునా బతిమాలుకుంది.

ఆమె గోడు ఎవరూ ఆలకించలేదు.

జోగయ్య కాస్సేపటికి పిల్ల పెద్దదై పెళ్లీడుకొస్తే దాని బాధ్యత తండ్రి చూడాలని పట్టుబట్టేడు.

దానిమీద నలుగురూ నాలుగు మాటలన్నారు.

పెళ్లి చేసేటప్పుడు కూతురికి సూరయ్య అయిదు వేలు ఇవ్వాలని తేల్చేరు.

అంతా ఎక్కడిదక్కడ పైసలా చేసేరు కాని కర్రావు దగ్గరే పేచీ వచ్చింది వాళ్లకు. అదీ కర్రావు దగ్గర కాదు. దాని కోడెదూడ దగ్గరే! కాపురానికి పంపేప్పుడు జోగయ్య కూతురితో పాటు కర్రావునీ పంపేడు. అక్కడికొచ్చాక నాలుగు ఈతలు ఈనింది. ఇది అయిదో ఈత.

జోగయ్య మనవడు అల్లుడు దగ్గర ఉండటానికైతే ఒప్పుకున్నాడు కానీ కర్రావుతో మాత్రం కోడెదూడ రావాలని పేచీ పెట్టేడు.

"ఠల్! వీల్లేదు. అది మా ఇంటికొచ్చాక ఈనింది కాబట్టి అది మాదే! ఇంతకు ముందు నాలుగీతలు దూడలు మావి కాలేదా?" అని నిలదీసేడు మారయ్య.

దానిమీద చాలాసేపు వాదనలు జరిగేయి.

ఆఖరుకు దాన్ని కూడా తెంపేసేరు.

కోడెదూడ సూరయ్య దగ్గరే ఉండేట్టు, దాని బదులుగా జోగయ్యకు మరో వందరూపాయలు ముట్టేట్టు తీర్పు చెప్పేరు.

అంతటితో వాళ్లు ఆ సమస్యను పరిష్కరించి పైకి లేచారు. మూడుగంటల బస్సు వచ్చివెళ్లింది. సూర్యుడి వేడింకా తగ్గలేదు. ఎక్కడా ఒక్క ఆకు కూడా కదలాడ్డం లేదు.

"లే లే! తొందరగా నడిస్తేగాని పొద్దు పడమటి గూట్లో పడబోయేసరికి ఊరికి చేరుకోలేం," ఏడుస్తున్న కూతురితో అన్నాడు జోగయ్య.

ఆమె లేచింది. తన గుడ్డలు, పిల్ల గుడ్డలు మూట గట్టుకుంది. ఆమెకు ఆ ఇంటిని వదిలి వెళ్లాలని లేదు. తన రెక్కలు నరికీ ముక్కలు ముక్కలు చేసి కట్టిన ఇల్లు... నవమాసాలు మోసి కన్న కొడుకుని వదిలి వెళ్లాలంటే ఆమె తల్లి మనసు ఒప్పుకోవడం లేదు. రేపటి నుంచి వాడికీ తనకూ ఏ బంధమూ లేదంటే ఆమెకు ఏడుపొస్తుంది.

చివరిసారిగా కొడుక్కి పాలిచ్చింది. వాడి ఒళ్లంతా తనివితీరా తడిమింది. ఏడుస్తూనే వాడ్ని ముద్దులతో ముంచెత్తింది. ఆమె ఎందుకేడుస్తుందీ అర్థంకాక పసివాడు వాడూ ఏడుస్తున్నాడు. వాడ్ని లోనికి ఈడ్చుకెళ్లేడు మారయ్య.

జోగయ్య ఆవుకు నీళ్లు పెట్టి మెడకు గుదిబండ కట్టేడు. మెడ తాడు పట్టుకుని బయల్దేరేడు. వాళ్ల వెనక వాళ్ల ఊరి నుంచి వచ్చిన మరో ఇద్దరు, కూతురి చెయ్యి పట్టుకున్న గోయిందూ కదిలేరు.

కర్రావు కదలడం లేదు. రెండడుగులు ముందు కేస్తే ఒకడుగు వెనక్కేస్తోంది. కోడెదూడ మెడతాడు గుంజిపట్టి కాళ్లు నేలకు తొక్కిపట్టి చెవులు రిక్కించి తల్లినే చూస్తుంది.

"ఒరే! ఇదొచ్చేట్టు లేదు. కర్రతో రెండు తగల్నియ్యండిరా," అన్నాడు జోగయ్య.

వెనక ఉన్నవాళ్లు గట్టిగా అదిలించేరు. అయిష్టంగానే ముందుకు కదిలింది ఆవు.

ఊరు దాటేరు. హరిజనవాడ దాటేరు. ఇక గ్రామ బొడ్డురాయి దాటుతారనంగా అప్పుడు కొమ్ము విసిరింది కర్రావు. విసిరి పక్క చేలోకి ఒక్క గెంతు గెంతింది. జోగులు చేతిలోని తాడు ఎప్పుడో జారిపోయింది.

"దీని సిగతరగ! జారిపోయె కదరా!" అని అరిచేడు జోగయ్య. కర్రావు ఊళ్లోకి అడ్డదిడ్డంగా పరుగు తీసింది.

మళ్లీ అందరూ వెనక్కు మళ్లేరు. ఇంటికి చేరుకున్నారు.

కర్రావు దూడ దగ్గర చేరింది. దాని పొదుగులో కోడెదూడ తల... తన్మయంగా నుంచుంది ఆవు. మనుషుల వైపు చూసి బుస కొడుతుంది అది.

గోవిందమ్మకు ఇంట్లో మంచి కొడుకు ఏడపు వినపడగానే చేతిలో నున్న గుడ్డలమూటను ఒక్క విసురు విసిరి లోపలికి పరుగెత్తింది.

ఇంటి లోపల-

సూరయ్య, తీర్పు చెప్పిన కులపెద్దలు నలుగైదు గురు కల్లు కుండలు ముందు పెట్టుకుని తాగుతూ ఏవేవో చెప్పుకుని పెద్దగా నవ్వుతున్నారు. అవతలగా ఏడుస్తున్న పసివాడు తల్లిని చూచి పరుగెత్తుకుంటూ వచ్చి పాలకోసం కొంగు లాగుతున్నాడు. ఆమెకు అంతా అర్థమైంది. వాడిని ఒక చేత్తో దగ్గరకు తీసుకుని ఆమె నిలువెల్లా ఊగిపోతూ "ఒరేయ్??" అంది.

ఇప్పుడామె అసిరమ్మలాగో ఆంకాళమ్మలాగో వుంది. సూరయ్య, కులపెద్దలు ఇంట్లో నుంచి పరుగెత్తుకొచ్చేరు. వాళ్లు ఆమెను చూసేసరికే సగం మైకం దిగి పోయింది. జోగయ్య ఉలిక్కిపడ్డాడు.

"ఒరే! అయ్యా, నువ్వు తెలిసే చేసేవో తెలవక చేసేవో, వీళ్ల డబ్బుమాయలో పడ్డారో, సారామాయలో మునిగేరో గాని నా బతుకులో నిప్పులు పోసేరు. తెల్లారే సరికి వాడు పెళ్లి చేసుకోగల్డు. కానీ, నా కొడుకును నాక్కాకుండా చేసి నా గొంతు నిలువునా కొయ్యాలని చూసేరు. ఇదుగో ఇప్పుడు నా కొడుకు నాతోనే వున్నాడు. ఇక మీదట ఉంటాడు. ఎవుడు అడ్డొస్తాడో రండి," అంటూ కొడుకుని సంకలోకి ఎత్తుకుని, కూతురికి గుడ్డల మూట ఇచ్చి,

"ఒరే అయ్యా! కోడెదూడ మెడతాడు విప్పు. ఆవు దగ్గరే దూడ ఉండటం ధర్మం," అంది జోగులుతో.

కాస్సేపటికి- గోయిందు కొడుకు నెత్తుకుని ముందు నడు స్తుంటే, ఆమె వెనక ఆవూ దూడ ఎవరూ పట్టుకోకుండానే నడుస్తున్నాయి.

వాటి వెనక జోగయ్య, మిగతా వాళ్లూనూ...

*ఆంధ్రజ్యోతి దినపత్రిక, 1 ఏప్రిల్ 1990*

